క్లుప్తంగా

దుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్సీ



దుర్గామాతను దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ రామారావు తదితరులు

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఎమ్మెల్సీ నర్తు రామారావు, చామంతి దంపతులు సోమవారం పాల్గొన్నారు. ప్రత్యేక పూజల్లో దర్గామాతను దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి (పార్లమెంట్) సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పార్టీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్రయాదవ్, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, కొఠారీ సర్పంచ్ పిట్ట ధనలక్ష్మి పాల్గొన్నారు.

వైద్య విద్య ప్రైవేటీకరణను వ్యతిరేకిద్దాం

టెక్కలి: పీపీపీ పేరుతో వైద్య విద్యను ప్రైవేటీకరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రను వ్యతిరేకించాలని కేవీపీఎస్ నాయకులు ఎస్.వి.జగన్నాథం, ఎం.కృష్ణయ్య, బి.ప్రభాకర్రావు సోమవారం కోరారు. వైద్య కళాశాలలను ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టి ఆ తరువాత అన్నివర్గాల పేద విద్యార్థులకు అన్యాయం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా విలువైన భూములను కారుచౌకగా ప్రైవేట్‌పరం చేయాలని చూస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రను తిప్పికొట్టడానికి అన్ని వర్గాల ప్రజలు తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు.

ఇస్కలపాలెంలో జిల్లాస్థాయి టాలెంట్ టెస్టు



టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్న దృశ్యం

సోంపేట: ఇస్కలపాలెం గ్రామంలో జిల్లాస్థాయి టాలెంట్ టెస్టును సోమవారం నిర్వహించారు. ఎ.యశ్వంత్ (హరిపురం) ప్రథమ, వంకల శ్రీవిద్య (గొల్లూరు) ద్వితీయ, తెప్పల వికాస్ (లోహరి బంద) తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి వరుసగా రూ.7,500 రూ.4,500, రూ.3,000 నగదు ప్రోత్సాహకంతో పాటు జ్ఞాపికలను అందజేశారు. నిర్వాహకులు బైపల్లి వాసు, సీహెచ్ శ్రీనివాస్, ఈశ్వరరావు, బైపల్లి రమేష్, ఎం.అప్పన్న పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి పాటుపడాలి

● మంత్రి అచ్చెన్నాయుడు



ఏఎంసీ నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి: రైతులు పండించే వివిధ రకాల ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా వారి సంక్షేమం కోసం మార్కెటింగ్ కమిటీ సభ్యులు పాటు పడాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళి ఏఎంసీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం కార్యాలయం ఆవరణలో సోమవారం జరిగింది. చైర్మన్‌గా బి.శేషగిరి, వైస్ చైర్మన్‌గా బాడాన వెంకటరమణమ్మతో పాటు కె.రామిరెడ్డి, కె.ధర్మారావు, టి.సింహాద్రినాయుడు, జె.రామ్‌జీ, ఎస్.ధనరాజ్, ఎస్.నాగరాజు, ఎల్.సుజాత, పి.సునీత, డి.పద్మావతి, ఎ.గౌరీ, హేమసుందరరావు, బి.అప్పలస్వామి, సీహెచ్ భీమారావుతో మంత్రి ప్రమాణం చేయించారు.

క్విజ్ విజేత విజయనగరం



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ రామారావు

సోంపేట: లక్కవరం గ్రామంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అంతర్‌జిల్లాల క్విజ్ పోటీల్లో విజయనగరం జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో గోకర్ణపురం, తృతీయ స్థానంలో బి.కేసుపురం నిలిచాయి. విజేతలకు ఎమ్మెల్సీ నర్తు రామారావు సోమవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వేణుగోపాలరావు, నారాయణరావు, హేమసుందర్, వజ్జకృష్ణ పాల్గొన్నారు.

జీఎస్టీ ప్రయోజనాలపై అవగాహన కల్పించాలి

సోంపేట: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ విధానంలోని ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఏపీఎం ప్రసాదరావు అన్నారు. సోంపేటలో సెర్ప్ సిబ్బందితో కలిసి జీఎస్టీ ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఇంటికీ సమాచారం చేరేలా అక్టోబర్ 19వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు.

వైద్యుల సమ్మెతో రోగుల అవస్థలు

● పీహెచ్‌సీలల్లో నిలిచిన అత్యవసర సేవలు

టెక్కలి: మెడికల్ పీజీలో సర్వీసు కోటా తగ్గింపును నిరసిస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు సోమవారం నుంచి సమ్మెకు దిగారు. దీంతో తొలి రోజు రోగులు అవస్థలకు గురయ్యారు. అత్యవసర సేవలు నిలిచిపోయాయి. టెక్కలి నియోజకవర్గంలోని టెక్కలి మండలం లింగాలవలస, సంతబొమ్మాళి మండలంలోని నౌపడ, బోరుభద్ర, దండుగోపాలపురం, నందిగాం మండలంలో నౌగాం, నందిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యులు సమ్మె బాటపట్టడంతో దిగువస్థాయి సిబ్బందితో వైద్య సేవలు నెట్టుకొచ్చారు. ప్రస్తుతం వ్యాధుల సీజన్ కావడం.. వైద్యుల సమ్మె కారణంగా కొన్నిచోట్ల రోగులు అవస్థలకు గురయ్యారు. సమ్మె కొనసాగిస్తే గ్రామాల్లో ఆరోగ్య సేవలు అగమ్యగోచరంగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి.



టెక్కలి: లింగాలవలస పీహెచ్‌సీలో విధుల్లో ఉన్న స్టాఫ్ నర్స్

● స్టాఫ్ నర్సే దిక్కు..

టెక్కలి మండలం లింగాలవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు సైతం సమ్మెలో ఉండడంతో అక్కడ ఒక్క స్టాఫ్ నర్స్ మాత్రమే రోగులకు దిక్కయ్యారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు వైద్య సాయం అందజేయడానికి డాక్టర్లు లేకపోవడంతో స్టాఫ్ నర్స్ చేత వైద్యం చెయించుకొని వెనుదిరిగారు.

● అత్యవసర సేవల్లో..

వజ్రపుకొత్తూరు: గోవిందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు డాక్టర్ వాహినీ ప్రియాంక, డాక్టర్ వినయకుమార్‌లు అత్యవసర సేవల్లో పాల్గొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి నల్ల బ్యాడ్జిలతో విధులకు హాజరయ్యారు. అత్యవసర కేసులను మాత్రమే పరీక్షించి మందులు అందించారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు.

నల్లబ్యాడ్జీలతో విధులకు..

పలాస: పలాస నియోజకవర్గంలోని పీహెచ్‌సీల్లో వైద్యుల సమ్మె పాక్షికంగా జరిగింది. వైద్యసేవలు నామ మాత్రంగా అందాయి. నల్లబాడ్జీలు పెట్టుకొని వైద్యులు విధులకు హాజరయ్యారు. అత్యవసర రోగులకు వైద్య సేవలు అందించారు. మందస మండలంలోని బుడంబో, మందస, సిరిపురం పీహెచ్‌సీ సిబ్బంది సమ్మెలో పాల్గొన్నారు.

● అరకొర సేవలు..

కంచిలి: ఇచ్ఛాపురం నియోజకవర్గ పరిధిలోని పీహెచ్‌సీల వైద్యులు సమ్మెలో పాల్గొన్నారు. దీంతో రోగులు కొద్దిగా ఇబ్బందులు పడ్డారు. అత్యవసర విధులకు మాత్రం హాజరవుతున్నట్లు వైద్య వర్గాలు తెలిపాయి. ఇచ్ఛాపురం మండలంలోని ఈదుపురం, కొళిగాం, కవిటి మండలంలోని బొరివంక, మాణిక్యపురం, రాజపురం, బెలగాం, కంచిలి మండలంలోని కంచిలి, మఠం సరియాపల్లి, సోంపేట మండలంలో కొర్లాం, బట్టిగళ్లూరు పీహెచ్‌సీలో సోమవారం సరైన వైద్యులు అందకపోవడంతో రోగులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా సోంపేట మండలం కొర్లాం పీహెచ్‌సీలో ఇప్పటికే వైద్యుల్లేరు. దీంతో అక్కడ రోగులకు వైద్య సేవలు అందడం లేదు. ఇక బట్టిగళ్లూరు సీహెచ్‌సిలో వైద్యురాలు సోమవారం విధులు నిర్వర్తించారు. ఆ ఆస్పత్రికి వెళ్లిన రోగులకు సేవలందించారు.



కంచిలి: సోంపేట మండలం బట్టిగళ్లూరు పీహెచ్‌సీలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యురాలు

పారిశుద్ధ్యం మెరుగుపరుస్తాం



మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో పారిశుద్ధ్యాన్ని యుద్ధ ప్రాతిపదికన మెరుగుపరుస్తామని మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు చెప్పారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వివిధ వార్డు కౌన్సిలర్లు దువ్వాడ శ్రీధర్, తంగుడు ఆశారాణి, బెల్లాల శ్రీనివాసరావు, కర్రి మాధవరావు, శర్వాన గీత, జోగ త్రివేణి, కోఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్‌కుమార్ ఆయా వార్డుల్లో నెలకున్న సమస్యలపై మాట్లాడారు. దీనికి చైర్మన్ గిరిబాబు సూచనల మేరకు కమిషనర్ సమాధానం చెబుతూ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. టిడ్కో ఇళ్ల అప్పగింతపై ప్రభుత్వం నుంచి స్పష్టత వస్తుందన్నారు. మార్చి 2026 నాటికి లబ్ధిదారులందరికీ టిడ్కో ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించి అందజేయాలని ఆదేశాలు అందాయన్నారు. వీధిలైట్లు, శానిటేషన్ నిర్వహణ సరి చేస్తామన్నారు. శివాజీనగర్ కాలనీలో అక్రమణలు జరగలేదన్నారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారుల జాయింట్ సర్వేల ప్రకారం వారి జిరాయితీ స్థలంలోనే కాంపౌండు వాల్ నిర్మాణం జరిగిందని కమిషనర్ చెప్పారు.

వందేళ్లనాటి వృక్షం సందర్శన



ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వజ్రపుకొత్తూరు రూరల్: నగరంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సోమవారం జాతీయ హరితదళ క్లబ్ ఆధ్వర్యంలో ఉద్దాన రామకృష్ణపురంలో వందేళ్ల చరిత్ర కలిగిన వటవృక్షం (పెద్ద మర్రి చెట్టు)ను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్జీసీ క్లబ్ కో ఆర్డినేటర్, పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు కొయ్యల శ్రీనివాసరావు చరిత్ర కలిగిన వృక్షం విశిష్టతను విద్యార్థులకు వివరించారు. వృక్షం ఊడలు పెరిగి నేలకు పాకుతూ ఎకరం విస్తీర్ణంలో విస్తరించిందని, పూర్వీకుల నుంచి మర్రి చెట్టును దైవంగా పూజిస్తున్నారని అన్నారు. ప్రతీ ఒక్కరూ బాధ్యతగా వనాలను సంరక్షించాలని, అరుదైన వృక్షాలను కాపాడటం ద్వారా జీవవైద్యాన్ని మరింతగా సంరక్షించుకోగలం అన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ చేపట్టారు.

ఐక్య పోరాటంతోనే ప్రవాసాంధ్రుల సమస్యల పరిష్కారం



సమావేశంలో పాల్గొన్న తెలుగు మహా సంఘ నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: ఛత్తీస్‌గఢ్‌లో ఉన్న తెలుగు వారంతా కలిసి ఐక్య పోరాటం చేసి ప్రవాసాంధ్రుల సమస్యలను పరిష్కరించుకోవచ్చని ప్రవాసాంధ్రుల తెలుగు మహా సంఘం అధ్యక్షుడు ఆర్.మురళి, కొత్తగా ఎన్నికైన సంరక్షకుడు వి.రామారావు అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో సోమవారం తెలుగు మహా సంఘ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. సుమారు ఆరు దశాబ్దాలుగా లక్షలాది మంది తెలుగు వారు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ జాతులను ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర జాబితా (గెజిట్)లో చేర్చాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎం.బాబూరావు, ఎస్.గణేష్, బైపల్లి తులసీరావు, బి.జోగారావు, ఎస్.రమణమూర్తి, పి.ఆదినారాయణ, ఎం.వెంకటరావు, డి.శ్యాంకుమార్ ఉన్నారు.

సరస్వతీ.. నమస్తుభ్యం..

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు చివరి దశకు చేరుకుంటున్నాయి. దీంతో ఆలయాలు, మండపాల్లో కొనువుదీరిన అమ్మవారికి ప్రత్యేక పూజల్లో భక్తులు నిమగ్నమయ్యారు. ఏడో రోజైన సోమవారం అమ్మవారు సరస్వతిదేవి అవతారంలో కొలువుదీరారు. ఈ సందర్భంగా పిల్లలతో అక్షరాభ్యాసాలు చేయించారు. అలాగే విద్యార్థులు సరస్వతీదేవి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చనలో అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

–సాక్షినెట్‌వర్క్



కంచిలి:జాడుపిలో సామూహిక కుంకుమ పూజలో మహిళలు



టెక్కలి సర్వమంగళవీధిలో సరస్వతి విగ్రహానికి పూజలు చేస్తున్న విద్యార్థులు

పుస్తకాలు పంపిణీ



టెక్కలి రోటరీనగర్ సత్యసాయి శాంతి సుధా మందిరంలో సోమవారం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. మందిరంలో సరస్వతి పూజాలు చేసిన అనంతరం టంకాల నాగరాజు కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో 65 మంది విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అన్నపూర్ణమ్మ, జగదీశ్వరరావు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

–టెక్కలి

ఇరువర్గాల కొట్లాటలో నలుగురు అరెస్ట్

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం గ్రామంలో ఈ ఏడాది జూన్ 17వ తేదీన జరిగిన ఇరువర్గాల కొట్లాట కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్సై శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. వీరంతా ఈ సంఘటన జరిగినప్పటి నుంచి పరారీలో ఉన్నారు. అరెస్టయిన వారిలో దాసరి నాగరాజు, మద్దిల జగన్నాథ్, దాసరి రాజయ్య, మద్దిల నవీన్ ఉన్నారని.. వారిని రిమాండ్‌కి తరలిస్తున్నట్లు చెప్పారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మిగిలిన వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామన్నారు.

స్కిల్ హబ్ సెంటర్‌లో ఉచిత శిక్షణ

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోలోని స్కిల్ హబ్ సెంటర్‌లో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ అందజేయనున్నట్లు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ సోమవారం తెలిపారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు సంబంధించి మూడు నెలలు శిక్షణ అందజేస్తున్నట్లు వెల్లడించారు. పదో తరగతి.. ఆపైన చదువుకున్న నిరుద్యోగ యువతీ, యువకులు అక్టోబర్ ఎనిమిదో తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆధార్, పాస్ పోర్ట్ సైజు ఫొటోలతో సెంటర్‌లో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 94932 90012 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఇచ్ఛాపురం జలమయం



దాసన్నపేట కూడలిలో రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణంలో సోమవారం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. కాలువల ఆక్రమణల కారణంగానే మురుగునీరు వర్షపు నీటితో కలసి రోడ్ల పైకివచ్చి ప్రవహిస్తున్నాయని స్థానికులు తెలిపారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ ఎస్.రమేష్ మాట్లాడుతూ.. కాలువల ఆక్రమణల నివారించేందుకు చర్యలు తీసుకొంటామని అన్నారు. పారిశుద్ధ్య కార్మికులతో కాలువల్లో పూడుకుపోయిన వ్యర్థాలను తీయించి రోడ్లపై నిలిచిన మురుగనీరు లేకుండా చర్యలు చేపట్టారు. మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ ఉపేంద్ర పర్యవేక్షించారు.

అభివృద్ధి పనుల టెండర్లు ఆమోదం



సమావేశంలో చైర్‌పర్సన్ రాజలక్ష్మి, కమిషనర్ రమేష్

ఇచ్ఛాపురం: పురపాలక సంఘం పరిధిలో పలు అభివృద్ధి పనులను 15వ ఆర్థిక సంఘం, సాధారణ నిధుల నుండి ఖర్చు చేయడానికి వచ్చిన టెండర్లను కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన సోమవారం సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. మూడు అంశాలపై చర్చజరగ్గా వాటికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వైస్‌చైర్‌పర్సన్-2 లాబాల స్వర్ణమణి మాట్లాడుతూ.. గతంలో జరిగిన గ్రామదేవత అమ్మవారి పండుగల నిమిత్తం బస్టాండ్ కూడలిలోని మెయిన్‌రోడ్‌లో ఏర్పడిన గుంతలను పూడ్చాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.రమేష్ దృష్టికి తీసుకెళ్లారు. మెయిన్ రోడ్ ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో ఉన్న సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా చూడాలని చైర్‌పర్సన్ సూచించారు.

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్



డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ పత్రాలు ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

కంచిలి: కూటమి ప్రభుత్వ పాలనలో అన్యాయానికి గురవుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కోసం మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రూపొందించిన డిజిటల్ బుక్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రం కంచిలి రాధాకృష్ణ ఆలయం ఆవరణలో డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ పత్రాలను మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిజిటల్ బుక్ ఉపయోగించే విధానాన్ని క్యాడర్‌కు వివరించారు. దీని ద్వారా అన్యాయానికి గురయ్యే కార్యకర్తల సమస్యలు, తీరు తెన్నులు నేరుగా పార్టీ అధిష్టానానికి సమాచారం వెళ్లి, వారక్కడ అవసరమైన లీగల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ నేత ఇప్పిలి క్రిష్ణారావు, గుమ్మిడి రామదాసు, దుర్గాసి ధర్మారావు, కొల్లి ఈశ్వరరావు, కొత్తకోట శేఖర్, పలికల జయరాం, బొండాడ వైకుంఠరావు, మద్దు వెంకటరావు, కొణపల సురేష్, డొక్కరి దాలయ్య, దుబ్బ లోకనాథం, కొల్లి తాతయ్య, మద్దు అభియాదవ్, మాస్టీల మన్మథరావు పాల్గొన్నారు.

పీఎం స్వానిధిలో పేరు నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న మెప్మా జిల్లా అధికారి రాము

ఇచ్ఛాపురం: చిరువ్యాపారులంతా పీఎం స్వానిధి పథకంలో చేరేందుకు పేరు నమోదు చేసుకోవాలని మెప్మా జిల్లా అధికారి బి.రాము సూచించారు. ఇచ్ఛాపురం పట్టణంలోని డీసీసీ బ్యాంక్ కార్యాలయం ఆవరణలో పీఎం స్వానిధి 2.0 లోక్‌కల్యాణ్‌పై బ్యాంకర్లతో సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పథకం ద్వారా మూడవ విడత రుణ సౌకర్యం పొందవచ్చన్నారు. ఇప్పటి వరకు రుణాలు పొందని వ్యాపారులు మెప్మా కార్యాలయంలో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. డీసీసీబీ మేనేజర్ అనితపండా, ఎస్‌బీఐ మేనేజర్ మనోజ్‌వర్మ, టౌన్‌మిషన్ కోఆర్డినేటర్ భాస్కర్‌రావు, సీవో సంతోష్, ఆర్‌పీలు, మెప్మా సిబ్బంది, యూనియన్, ఇండియన్, ఏపీజీవీబీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పత్రి ఉత్సవం



నందిగాంలో సామాలమ్మ వద్ద పత్రి ఉత్సవం నిర్వహిస్తున్న రైతులు

నందిగాం: మండలంలో దుర్గాష్టమిని పురస్కరించుకొని ఘనంగా పత్రిఉత్సవం నిర్వహించారు. సోమవారం ఉదయం మహిళలు ఆయా గ్రామాల్లో గ్రామదేవతలకు ముర్రాటులతో చల్లదనం చేయగా సాయంత్రం రైతులు పత్రి కొమ్మలతో ఊరేగింపుగా గ్రామ దేవతల వద్దకు వెళ్లి పూజలు నిర్వహించి మొక్కు చెల్లించిన కొమ్మలను పొలాల్లో వేశారు. ఇలా చేస్తే పంటలు బాగా పండుతాయని నమ్మకంతో అనవాయితీగా వస్తున్న ఆచారంగా భావించి ఈ కార్యక్రమం చేశారు. నందిగాం, పెంటూరు, నరేంద్రపురం, కణితూరు, పెద్దతామరాపల్లి, నౌగాం, తదితర గ్రామాల్లో ఈ ఉత్సవం ఉల్లాసంగా నిర్వహించారు.

అపూర్వ కలయిక



ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలో 2013-16 విద్యా సంవత్సరంలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చదువుకున్న రోజులను గుర్తు చేసుకొని సందడి చేశారు. ఈ సందర్భంగా వారికి విద్యాబుద్ధులు నేర్పించి భవిష్యత్‌కి బాటలు వేసిన అప్పటి ప్రిన్సిపాళ్లు డాక్టర్ రబీన్‌కుమార్‌పాఢీ, డాక్టర్ నిత్యానంద పట్నాయక్, అధ్యాపక బృందాన్ని దుశ్శాలతో సత్కరించి అభినందించారు. కళాశాలకు తమ వంతు సాయం చేయాలని నిర్ణయించారు. పూర్వ విద్యార్థులు శివప్రసాద్, ఆశి ప్రశాంత్, కె.శివ, బి.లోహిత్, రోహిత్, ధర్మరాజు, నిర్మల, కల్పన ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో బారువ విద్యార్థి ప్రతిభ



కాంస్య పతకంతో కృష్ణ

సోంపేట: బారువ గ్రామానికి చెందిన బి.కృష్ణ అండర్-20 విభాగంలో జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో కాంస్య పతకం సాధించాడు. గుంటూరులోని ఆచా ర్య నాగార్జున యూనివర్సిటీలో 38వ ఆంధ్రప్రదేశ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు ఈ నెల 26, 27, 28 తేదీల్లో జరిగాయి. పోటీల్లో కృష్ణ తృతీయ స్థానం సాధించి కాంస్య పతకం సాధించడంతో క్రీడాకారు లు, స్నేహితులు అభినందించారు.

పంచాయతీ దుకాణాల్లో బినామీలను తొలగించండి

● వార్డు సభ్యుల డిమాండ్



అధికారులను నిలదీస్తున్న సభ్యులు

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలో ఇటీవల నిర్వహించిన పంచాయతీ దుకాణాల బహిరంగ వేలంలో కొంతమంది బినామీదారులు దుకాణాలు దక్కించుకున్నారని.. అటువంటి వారిపై చర్యలు తీసుకుని అర్హత కలిగిన వారికి కేటాయించాలని వార్డు సభ్యులు డి.ధర్మారావు, పి.రమణబాబు, టి.లోకేశ్వర్రావు, అశోక్, గురివినాయుడు తదితరులు డిమాండ్ చేశారు. సోమవారం పంచాయతీ కార్యాలయంలో ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో భాగంగా పంచాయతీలో సభ్యులకు తెలియకుండా అడ్డగోలుగా చేసిన తీర్మానాలపై సభ్యులు ధ్వజమెత్తారు. దుకాణాల బహిరంగ వేలం పాటలో అడ్డగోలుగా వ్యవహరించారని మండిపడ్డారు. పంచాయతీ సభ్యుల తీర్మానం లేకుండా బిల్లులు ఎలా చేస్తున్నారని నిలదీశారు. పంచాయతీలో 35 లక్షల రూపాయలతో చేపట్టిన సెంట్రల్ లైటింగ్ పనుల్లో పాత సామగ్రి ఏం చేశారని.. వాటి వివరాలు బహిర్గతం చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యాలయానికి ఎదురుగా ఇటీవల కూరగాయల కాంప్లెక్స్‌ను తొలగించారని అయితే గుర్రాల చావడి స్థలంలో పూర్తిగా శిథిలావస్థలో ఉన్న పంచాయతీ దుకాణాలు ఎందుకు కూల్చివేయడం లేదని ప్రశ్నించారు. ఇదిలా ఉండగా పాతబస్టాండ్ సమీపంలో పంచాయతీకి చెందిన 39, 42, 54 నంబర్లు కలిగిన దుకాణాలపై హైకోర్టును ఆశ్రయించామని.. ఇందులో 42 నంబర్ కలిగిన దుకాణదారుడు అద్దె చెల్లించడం లేదని ఈవో శ్రీనివాస్ వెల్లడించారు. పంచాయతీ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా నిరంకుశంగా పాలన కొనసాగిస్తున్నారని దీనిపై తగిన మూల్యం చెల్లించకోక తప్పదని సభ్యులు హెచ్చరించారు.

అమ్మవారికి 108 రకాల ప్రసాదాలతో నైవేద్యం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా అమ్మవారికి సోమవారం సాయంత్రం 108 రకాల ప్రసాదాలను భక్తులు నైవేద్యంగా సమర్పించుకొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



శ్రీ స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో 108 రకాల ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించిన భక్తులు